కడలిబంధం

బి.హెచ్.ఫణిమాధురి



"ఈనాటి మన పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థుల తల్లి తండ్రులకు నమస్కారాలు. అందరికీ పాఠశాల ఆహ్వాన కమిటీ తరపున ఆహ్వానం పలుకుతున్నాం" చప్పట్లు మోగాయి అనౌన్స్‌మెంటు వినగానే.

"ఎంత తీరికలేని కార్యకలాపాలున్నప్పటికి, సామాజిక కార్యక్రమాలలో నిత్యం బిజీగా వుండే శ్రీ శంకరంగారు మన ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ వేదిక పైకి రావలసిందిగా కోరుతున్నాం"...

ఓ అందమైన యువకుడు, బ్లూ కలర్ ఫుల్ హాండ్స్ రేమండ్ షర్ట్, గ్రే కలర్ ప్యాంటుతో, బాగా పాలిష్ చేసిన బ్లాక్ అంబాసిడర్ షూస్‌తో ఠీవైన నడకతో వేదికపైకి వచ్చి కుర్చీలో కూర్చోవడం, కమిటీ వారు పూలదండతో సత్కరించడం వెంట వెంటనే జరిగిపోయాయి. కెమెరాలు క్లిక్ మంటు ఆ దృశ్యాన్ని బంధించాయి.

అతనిని చూడగానే ఒక్కసారి అవాక్కయ్యింది వాసంతి. శంకరం, ఇంటర్మీడియెట్ రోజులలో తన క్లాస్‌మేట్.

''భర్త పాల్గొనే సేవా కార్యక్రమాలలో తాను పాల్గొంటూ, వారికి నిత్యం చేదోడు వాదోడుగా వుంటూ మన ఆహ్వానాన్ని మన్నించి యీ సమావేశానికి విచ్చేసిన శంకరంగారి సతీమణి శ్రీమతి సుబ్బలక్ష్మి గారిని కూడ వేదికపైకి రావలసిందిగా సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను''.

నల్లగా, బొద్దుగా వున్న ఓ అయిదు అడుగుల రెండు అంగుళాల యువతి సిగ్గుపడ్తూ వేదిక నెక్కి తన భర్త ప్రక్కనే వున్న కుర్చీలో ఒదుగుతూ కూర్చుంది.

ఈసారి నిజంగానే మూర్ఛవచ్చినంత పన యింది వాసంతికి. తన కళ్ళను తానే నమ్మలేకపోతోంది. ఆ సుబ్బలక్ష్మి తమ కాలేజి అటెండర్ నరిశింహం కూతురు సుబ్బులు. అలియాస్ సుబ్బులమ్మ.

ఒక్కసారి స్టేజిపై వున్న శంకరం, సుబ్బలక్ష్మిలను తదేకంగా రెప్పవాల్చకుండా చూడడం వల్ల కాబోలు వాసంతి కళ్ళమ్మట నీళ్ళు కారసాగాయి.

అనుమానం నివృత్తి చేసుకోవడం కోసం ప్రక్కనే కూర్చుని వున్న ఆ ఫాఠశాల ఉపాధ్యాయురాలిని అడిగింది... '' ఆవిడ ఎవరని''....

తన సందేహం పూర్తిగా తీరుస్తూ నరిశింహం కూతురిగా, శంకరంగారి భార్యగా సమాధానం వచ్చింది.

ఈ సమావేశానికి తనెందుకు వచ్చిందీ అప్పటికిగాని స్ఫురణకు రాలేదు వాసంతికి.

ప్రక్కనే వున్న హరిని పరికించింది. వాడు తదేకంగా బహుమతి కోసం ఆశగా ఎదురు చూస్తున్నాడు కాబోలు తనను పట్టించుకొన్నట్లు లేదు. వాడు రెండవ తరగతి చదువుతున్నాడు. వాడికి తెలుగు కంఠస్థ పద్య పఠనంలో ప్రథమ స్థానం రావడం, బహుమతిని స్వీకరించడానికి రమ్మనమని కబురు రావడం వల్ల తను వచ్చానన్నా సంగతి గుర్తు కొచ్చి ఒక్కసారి నవ్వుకుంది. హరి తన ఏకైక బిడ్డ.

ఉపన్యాసాలు మొదలయ్యాయి.

వాసంతి మనస్సు అనేక ప్రశ్నలను సంధిస్తూ పరిభ్రమింపసాగింది.

''ఈ శంకరం, సుబ్బలక్ష్మిలు తనకు బాగా పరిచయమైన శంకర్, సుబ్బులమ్మలేనా''.

''శంకరం, సుబ్బలక్ష్మిని ఏంచూసి వివాహం చేసుకున్నట్లు? లేక...'' తన ఆలోచన తనకే సిగ్గనిపించింది.

''ఆస్థి, అంతస్థు, అందం, హోదా అన్నీ వున్న శంకర్‌కు యీ నల్ల మొద్దులా వుండే యీ అనాగరిక సుబ్బులమ్మ అర్ధాంగి ఎలా అవ్వగలిగింది''.

''అసలు వారి వివాహం ఎవరి ప్రమేయంతో, ఏ సందర్భంలో అయ్యుంటుంది''

ఇలా వేధిస్తున్న ప్రశ్నలు తనని కుర్చీలో స్థిమితంగా కూర్చోనీయకుండా చేస్తున్నాయి. ఉపన్యాసాలు ఒక వైపున సాగుతుండగానే వాసంతి మనస్సు గతంలోకి వేగంగా జారిపోయింది.

***

అవి తాను రాజమండ్రిలో యింటర్మీడియట్ చదివే రోజులు. ఆ రెండేళ్ళు రెండురోజుల్లా ఆనందంగా గడచిపోయాయి. కాలేజికి వెళ్ళే ప్రతి రోజు ఎంతో వుల్లాసంగా వుండేది. శలవుల్లో కూడ స్పెషల్ క్లాస్‌లుంటే బాగుండేదని గాయత్రి అంటూ వుండేది. గాయత్రి తన పిన్నిగారి అమ్మాయి.

తమ క్లాసులోనే చదివేవారు శంకర్, సునీల్, రవి, గిరీష్‌లు. వీరి అల్లరికి అందరు భయపడిపోయేవారు. ''కోతిమూక'' అని పిలిచేవారు.

వారందరిలోకి శంకర్ అంటే అందరికి, అబ్బాయిలకు అమ్మాయిలకు కూడా యిష్టంగా వుండేది. మంచి స్టూడెంట్. చదువుల్లోను, ఆటల్లోను అతనే ఫస్ట్. కాలేజిలో జరిగే ప్రతి ఫంక్షన్ అతని చేతుల మీదుగానే బ్రహ్మాండంగా జరిగేది. ప్రిన్సిపాల్ గార్కి, లెక్చరర్లకు కూడ అతనే యిష్టుడు. ప్రియమైన విద్యార్థి. అంత మంచి గుణాలున్నాయి కాబట్టే కాలేజి ఆడపిల్లలకు అతనొక కలలహీరో.

ఇంక తమ క్లాస్‌మేట్ శ్రావణికి అయితే అతడే రియల్ హీరో. అతనితో ప్రేమసామ్రాజ్యంలో రోజంతా విహరిస్తూ వుండేది. చూపు కోసం పడిచచ్చేది. ఎంత అల్లరి చేసినా కాలేజిలో అటెండర్ దగ్గర్నుండి అఫీషియల్ స్టాఫ్ వరకు అతనంటే అందరికి ఆరాధన వుండేది. అందర్ని నవ్విస్తూ వుండేవాడు. కష్టమొస్తే ముందుండి నేనున్నాను భయంలేదనేవాడు. ఫీజు కట్టలేని విద్యార్థులకు అడపాదడపా సహాయం చేసేవాడు. అమ్మాయిలను ఆటపట్టించేవాడు. ఆ అవకాశం కోసమే కొంత మంది అమ్మాయిలు ఆశగా ఎదురుచూసేవారు. అదే అలుసుగా తీసుకుని నిజంగానే ప్రేమించడం మొదలెట్టింది శ్రావణి. అతని మాటంటే పడిచచ్చేది. అప్పటికే రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టారు. విడిపోయే రోజులు వచ్చేసే కొద్ది శ్రావణి ఆరాటం ఎక్కువయిపోయి చదువు మీద ధ్యాస సన్నగిల్లిపోయేలా చేసుకొనేది.

శ్రావణి గురించి చెప్పాలంటే, అందంగానే వుండేది. డబ్బు, పరపతి, హోదా వున్న యింట గారాబంగా పెరుగుతోంది. తెల్లగా, నాజూగ్గా, మోడరన్ గర్ల్‌లా వుండేది. తరగతిలో నిశ్శబ్దంగా వుంటూ పాఠాలను తదేకంగా వినేది. వేరే ధ్యాసే లేదు శంకర్‌ను ప్రేమించడం తప్ప. అతి బిడియస్తురాలవడం వల్ల అది వ్యక్తీకరించలేక తన సహాయాన్ని కోరేది.

తమ బ్యాచ్‌లో ఆడపిల్లలు ముగ్గురు. తమతో శంకరం చాలా సోషల్‌గా మూవ్ అయ్యేవాడు. అందువల్లే అది తన పట్ల నమ్మకం పెంచుకొని తన ప్రేమ ఫలించేలా చూడమని అడుగుతూ వుండేది, వీలు దొరికినప్పుడల్లా. మొదట్లో తాను చిరాకు పడేది. కాని అదిపడే ఆరాటం, కల్మషంలేని ఆరాధన చూసి 'సరే'అని అనకుండా వుండలేకపోయేది.

అమ్మాయిలు మూతిముడుచుకు కూర్చుంటే అబ్బాయిలకు ఏడిపించాలని అనిపిస్తుంది. అదే వారిని ఆటపట్టిస్తూ వుంటే మన జోలికి రారు అనే సిద్ధాంతాన్ని నమ్మిన దాన్ని కాబట్టి తనతో శంకర్ క్లోజ్‌గా వుండేవాడు.

అవకాశం కోసం ఎదురు చేసే తనకు ఓరోజు యీవెనింగ్ లేబ్‌లో ఒంటరిగా దొరికాడు శంకరం. ఫిజిక్స్ ప్రాక్టికల్స్ చేస్తూ.

''శంకరం! నీ కెలాంటి భార్య కావాలి''... ఊహించని ప్రశ్నకు.

''ఐశ్వర్యరాయ్‌లా ఉంటే చాలు''... అతని టక్కరి సమాధానం.

''అయితే ఆలస్యమెందుకు. వెళ్ళి ఆమెను రిక్వెస్ట్ చేయలేకపోయావా'' తన నుండి మరో ప్రశ్న.

వాసంతి మనస్సు అనేక ప్రశ్నలను సంధిస్తూ పరిభ్రమింపసాగింది. ''ఈ శంకరం, సుబ్బలక్ష్మిలు తనకు బాగా పరిచయమైన శంకర్, సుబ్బులమ్మలేనా. శంకరం, సుబ్బలక్ష్మిని ఏంచూసి వివాహం చేసుకున్నట్లు? లేక...'' తన ఆలోచన తనకే సిగ్గనిపించింది. ''ఆస్థి, అంతస్థు, అందం, హోదా అన్నీ వున్న శంకర్‌కు యీ నల్ల మొద్దులా వుండే యీ అనాగరిక సుబ్బులమ్మ అర్ధాంగి ఎలా అవ్వగలిగింది''. ఇలా వేధిస్తున్న ప్రశ్నలు తనని కుర్చీలో స్థిమితంగా కూర్చోనీయకుండా చేస్తున్నాయి.

''నీవు నా తరపున వకాల్తా పుచ్చుకుని ట్రై చేస్తావని ఆగాను'' కొంటె చూపుతో నిర్లక్ష్య సమాధానం.

శంకరం గురించి శ్రావణి తనను పదేపదే ప్రాధేయపడడం, చదువులో అది పోగొట్టుకుంటున్న శ్రద్ధ, ఏదో ధ్యాసలో వున్నట్లు యీ మధ్య కన్పించడం జ్ఞాపకం వచ్చి యింక ఆలస్యం చేయకూడదని, యిదే సమయం సరియైనది అనుకుంటూ.

''శ్రావణిపై నీ అభిప్రాయం'' ఊహించని యీ తరహా ప్రశ్నకు ఒక్కసారి నిశ్చేష్టుడయినట్లనిపించాడు శంకరం.

''ఆమెపై ఏ నిశ్చితమైన అభిప్రాయం నాకు లేదు. ఉండవలసిన అవసరం ఏముంది? అయినా ఆ అమ్మాయి మంచి అమ్మాయి. తరగతిలో రిజర్వుడుగా వుంటూ బాగా చదువుతుంది'' స్పష్టంగా చెప్పాడు.

''నీ వంటే బాగా యిష్ట పడ్తోంది. మనసారా అది నిన్నే ఆరాధిస్తోంది. నీవు అంగీకరిస్తే వాళ్ళ నాన్న గారిద్వారా మీకు కబురు పంపుతానంటోంది'' సాగదీయకుండా అసలు విషయం బైట పెట్టాను.

''నా కిష్టం లేదు. నేనిప్పుడే పెళ్ళిచేసుకోను. తనకునచ్చిన మంచి పొజిషన్‌లో వున్న మరొకణ్ణి ఎంచుకుని సుఖపడమను'' సంభాషణ పొడిగిం

చడం యిష్టంలేక కాబోలు వడివడిగా నడుచు కుంటూ లేబ్ వదిలి వెళ్ళిపోయాడు శంకరం.

ఇంత అందమైన అమ్మాయి ఏరికోరి వస్తే కాదంటున్నాడంటే అతనికి కావలసిన అమ్మాయి ఏ ''మిస్ యూనివర్సో'' అయ్యుండాలి అనిపించింది తనకు.

అదే విషయం శ్రావణికి నెమ్మదిగా చెప్పి అతనిపై ఆశవదులుకొని బుద్ధిగా చదువుకోమని సలహా ఇచ్చింది. తర్వాత రోజు నుండి శ్రావణి అసలు కాలేజీకే రావడం మానేసింది. పెద్ద తప్పుచేశానేమో అని అనిపించింది ఆ రోజు.

ప్రతి రోజు శంకరం బ్యాచ్‌ను మా తెలుగు లెక్చరర్ తిడుతూనే వుండేవాడు. ''ఆడపిల్లలను చూసినేర్చుకోండిరా! చదువు సంధ్యలేకుండా వెధవ తిరుగుళ్ళు మీరున్నూ''... అంటూ వుంటే వారిని కావాలనే వెనక్కి చూచి వెక్కిరించేవాళ్ళం.



వాళ్ళు కూడ తక్కువేంతినలేదు. ''కెమిస్ట్రీ మేడమ్ క్లాస్‌లో చెపుతాం! మీ పనీ'' అని ఎగతాళి చేసేవారు. ఆ మేడం ఎప్పుడూ వారినే వెనకేసుకు వస్తూ మమ్మల్ని తిడుతూ వుంటుంది. ఆవిడ ఫాషన్ పెరేడ్‌కు వెళ్ళేటట్లు మేకప్ చేసుకోవచ్చు. మేం మాత్రం సంప్రదాయదుస్తులతో సాదాగా కాలేజీకి రావాలి. అంచేత ఆ మేడంను చూస్తే మా అందరికి కోపంగా వుండేది.

శంకర్ అందరు అమ్మాయిలను అవకాశం వున్నప్పుడల్లా ఏడిపిస్తూనే వుండేవాడు. అఖరికి మా కాలేజి ఫ్యూన్ నరిశింహం కూతురు సుబ్బులమ్మను కూడ వదిలేవాడుకాడు. నల్లగా, బొద్దుగా తుమ్మమొద్దులా వుండేది అది.

''చదువు కోమంటే నాకు చదువు రాదంటుంది'' నరిశింహం అప్పుడప్పుడు చెప్తు బాధపడుతుండేవాడు.

''ఆరవ తరగతి వరకు చదివి మానేసింది. ఒట్టి అమాయకురాలు. ఎలా బతుకుతుందో ఏమో! నే బతికున్నంత వరకు బాధలేదు తర్వాత దానికెవరు చూస్తారు. దానిబతుకేంటి అనేదే నా చింతమ్మా'' అంటూ నరిశింహం అందరితోను వాపోయేవాడు. భగవంతుడే వున్నాడని సరిపెట్టుకొనేవాడు అతనే.

ప్రతిరోజు సుబ్బులమ్మ వాళ్ల అయ్యకు మధ్యాహ్నం భోజనం పట్టుకుని కాలేజీకి వస్తూ వుండేది. నరశింహం భోజనం చేసే వరకు వుండి ఆ గిన్నె పట్టుకుని వెళ్ళిపోయేది. భోజనం టైములో వచ్చీరాని ఇంగ్లీషులో మాట్లాడుతూ నవ్విస్తూ వుండేది. దాని అమాయకత్వానికి అందరికీ జాలివేసేది. నరిశింహంపై సానుభూతి కలిగేది.

శంకరం సుబ్బులమ్మను చిన్న కల్పనారాయ్ అనిపిలుస్తూ ఏడిపిస్తూ వుండేవాడు. సుబ్బులమ్మ పేరు బాగోలేదని, దాన్ని మార్చమని రోజువాళ్ళ నాన్నతో గొడవ పడేదట. కొన్నాళ్ళు రావడం మానేసింది. అప్పటి నుండి వాళ్ళ నాన్న సుబ్బలక్ష్మిగా పిలిచేవాడు. ఈ విషయం నరిశింహమే ఒకరోజు మాతో చెప్పడం వల్ల తెలిసింది. ఆరోజు నుంచి అందరం సుబ్బలక్ష్మి అనే పిలిచేవాళ్ళం. ఇది విన్న మగపిల్లలు మాత్రం ఆ అమ్మాయిని సుబ్బాయమ్మా! సుబ్బులమ్మ అంటూ ఏడిపించేవారు.

కొంతకాలం ఆ మాటలకు భయపడి మరల కాలేజీకి రావడం మానేసింది. నరిశింహం బ్రతిమాలి ఆ బాబులు సరదాగా పిలుస్తారు అంతే! అందరు మంచి బాబులే! మనల్ని ప్రేమగా చూస్తారు అంటూ చెప్పి కోపాన్ని తగ్గించి తిరిగి వచ్చేలా చేశాడు.

మొత్తానికి కాలచక్రం గిర్రున తిరగి మమ్మల్ని విడతీసాయి. మా కాలేజీలో డిగ్రీలేకపోవడం వల్ల ఎవరికి వారు వేరువేరు చోట్లకు వెళ్ళిపోవడం జరిగింది. కొంతమందికి వివాహం అయి వేరొక వూర్లో సెటిలవ్వడం వంటివి కూడ సహజంగానే జరిగిపోయాయి. శంకరం కుటుంబం చెన్నై వెళ్ళినట్లుగా తర్వాత తెలిసింది.

తనకు డిగ్రీ పూర్తయ్యాక శ్రీకర్‌తో వివాహం జరగడం, వుద్యోగరీత్యా అతను ఢిల్లీలో వుండటం మూలంగా ఢిల్లీ వెళ్ళిపోవడం జరిగింది. శ్రీకర్‌కు హైద్రాబాద్‌లో ఓ మంచి కంపెనీకి ఆఫర్‌రావడం, ఆ రీత్యా మేము హైద్రాబాద్ మకాం మార్చడం జరిగి బాబును ఇక్కడ జాయిన్ చేశాం.

''అమ్మా! వాసంతమ్మా!'' ఆప్యాయంగా పిలిచిన ఆ పిలుపుకు యీ లోకంలోకి వచ్చింది. ''బాగున్నావా! అమ్మా!''... వెనక్కి తిరిగి చూసింది. అతను నరిశింహం. అప్పటి తమ కాలేజి అటెండర్. అప్పటికి యిప్పటికి అతనిలో మార్పేమీలేదు. కాకి చొక్కా, కాకినిక్కరు భుజంపై తువ్వాలు. బట్టతలతో బొద్దుగా అలాగే వున్నాడు. అతనికిరువైపులా యిద్దరు పిల్లలు. 7,8 ఏళ్ళుంటాయి వారికి.

''బాగున్నావా! నరిశింహం. యీ బాబు లిద్దరు ఎవరు?''

''మా మనమలమ్మ. మా సుబ్బులమ్మపిల్లలు'' ఒకింతగర్వం తొణికిసలాడుతూ చెప్పాడు.

''ఏమిటి సుబ్బులక్ష్మికి యిద్దరు పిల్లలా! పైగా యింత వయస్సు వచ్చిందా అప్పుడే! అసలు పెళ్ళి ఎప్పుడయింది'' ఆశ్చర్యం ఆపుకోలేక గడగడ అడిగేశాను.

నరిశింహం ఒకింత నిట్టూరుస్తూ....

''అది ఒక పెద్ద కత తల్లీ! శంకరం బాబు మా పాలిట దేవుడమ్మ. మా సుబ్బులు ఏనాడో చేసుకున్న పున్నెమమ్మా! యింత మంచి భర్త దొరికాడు'' కూతురి అదృష్టానికి మురిసిపోతు చెప్పసాగాడు జరిగిన విషయాన్ని తన బాణీలో.

''మా సుబ్బులమ్మను తల్లిలేనిపిల్ల కాబట్టి అతిగారాం చేశాను నీకు తెలుసుకదమ్మా''

''అవునూ! పల్లెత్తు మాటెప్పుడు అనేవాడవు కాదు. నాకు తెలుసు''...వత్తాసు పలికింది.

''దానిపెళ్ళికని కష్టపడి కొంతసొమ్ము దాచి, కొలువు తీరేకవచ్చిన సొమ్ము కలిసి మా వూరు పోస్టుమాన్ కొడుకుతో పెళ్ళి కుదిర్చాను. మంచి కుర్రాడే. ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు మద్రాసులో సిమెంటు కంపెనీలో''...నేవింటున్నానో లేదోనని నావేపే తేరిపారచూశాడు నరిశింహం.

''చెప్పు నరిశింహం! వింటున్నాను''

''మగపెళ్ళివారు మద్రాసులోనే పెళ్ళి జరిపించాలి అనిపట్టుపట్టడంతో నేను మా చిన్నయ్య గారింట్లో మద్రాసుకు మకాం కుదిర్చాను తాత్కాలికంగా, పెళ్ళిపనులకోసం''.

ఇంతలోనే మాయిదారి సునామీ రావడం ఎందరినో పొట్టన పెట్టుకోవడం జరిగింది. తమ వాళ్ళను కోల్పోయిన వారెందరో అనాధలైపోయి చెట్టుకొకరు పుట్టికొకరులా చెల్లాచెదురైపోయారు అలా అనాధలైన వారే యీ పిల్లలిద్దరు'' వారికి వినపడకుండా నెమ్మదిగా వంగి చెప్పాడు. అదీ అతని సంస్కారం, పిల్లల మనస్సు గాయపడకూడదని.

''వీరిని సుబ్బులమ్మ చేరదీసి ఆ రోజు నుంచి

పెంచసాగింది. వారితల్లి తండ్రులు పోవడంవల్ల తానేతల్లి, తండ్రి అయి కాచింది. పెళ్ళిరోజు వచ్చింది. ముహూర్తం సమయం దగ్గరవుతోంది. ఈ యిద్దరి పిల్లలను చూచిన పెళ్ళివారికి అనుమానం వచ్చి ఎవరు! అని అడగడం జరిగింది! చెప్పడం అయింది.

అయినా యీ కాలం మనుషులు కదమ్మా! వారికి యీ పని నచ్చలేదు సరిగదా లేనిపోని అభాండాలు వేశారు నా బిడ్డమీద. వారిని వదిలేస్తే పెళ్ళి జరుగుతుంది అని ఖరాఖండిగా చెప్పేశారు. నా బిడ్డ వప్పుకోకపోయేసరికి పీటల మీద నుండి లేచిపోయారు. పుకారులు లేవదీశారు. దీనితో కృంగిపోక సుబ్బులమ్మ యింటివద్దే వుంటూ పిల్లలను సాకుతూ వచ్చేది. నేను మాత్రం ఆ సంఘటనను దానిలా తేలికగా తీసుకోలేకపోయాను. తేరుకోలేక, ఆ పిల్లలకోసం అది భరించే అపవాదులకు తట్టుకోలేకపోయేవాణ్ణి. పెళ్ళికి ముందే పిల్లలను కంది, అబద్ధాలు ఆడుతోంది అని అందరు అంటు వుంటే భరించలేకపోయే వాణ్ణి తల్లి'' తుండుతో కళ్ళూ తుడుచుకొని తిరిగి మొదలెట్టాడు.

''అటువంటి టైములో అనుకోకుండా ఓ రోజు సిటిబస్ స్టాపులో మన శంకరం బాబు కనిపించాడు. జరిగిందంతా అడిగి తెలుసుకున్నాడు. బాబు చాలామంచి బాబుకదమ్మా! అందువల్ల ఏదీ దాచకుండా వుండలేకపోయాను. మా యింట్లో పిల్లలతో ఓ రోజు నేను, సుబ్బులమ్మ వీధిలో కూర్చుని వుండగా ఓ కారు వచ్చి ఆగింది మా ముందర. అందులో నుంచి దిగాడు శంకరం బాబు. చేతిలో పళ్ళబుట్ట, పూలదండలతో అతని డ్రైవర్ కూడ వచ్చాడు. నోటమాటరాలేదు. మంచి నీళ్ళిచ్చి కూర్చోమన్నాను. తను వచ్చిన పని చెప్పాడు. ''మీ సుబ్బులమ్మను పెళ్ళిచేసుకోవాలని సంకల్పించానునరశింహం. ఇది వుద్రేకంలో తీసుకున్న నిర్ణయం కాదు. ఆలోచించే యిక్కడకు వచ్చాను. ఎక్కడో దొరికిన అనాథ పిల్లలకు తానే తల్లి తండ్రిగా వుంటూ సమాజాన్నే ఎదిరించిన మీ అమ్మాయి భర్తను ఎంతగా గౌరవిస్తుందో చెప్పక్కర్లేదు. అందువల్ల సుబ్బలక్ష్మి నాకు తగిన భార్య అనుకొనివచ్చాను. నీకు అంగీకారమైతే యీ నిముషంలోనే పిల్లలతో సహితంగా నా దాన్ని చేసుకోవడానికి వచ్చాను'' అని అంటూ వుంటే ''ఆ నిముషంలో మాట, ఊపిరి రెండు ఆగిపోయినంత పని అయిందమ్మా! నాకు. దేముడే స్వయంగా పిలవకుండా వచ్చివరమడిగితే ఎలాగుంటుందో పరిస్థితి ఊహించమ్మా! నా పరిస్థితి అలాగే అయింది. అచేతనంగానే వూ కొట్టాను. దండలు మార్చి సుబ్బలక్ష్మి దగ్గరకు తీసుకొన్నాడు. నా పాదాలకు నమస్కారం చేశారు. ఆ క్షణంలోనే, నా సుబ్బులు ఓ వుత్తమునికి యిల్లాలు అయింది. ఇప్పటివరకు అనాథలైన నా మనమలు ఆదర్శభావాలుగల ఓ వ్యక్తికి తండ్రి స్థానాన్ని యిచ్చారు''. ఆగని కన్నీటిని తిరిగి తుడిచాడు నరశింహం. బలవంతంగానే కంట్రోలు చేసుకున్నాను కొన్నాళ్ళకి.

''అంతే కాదు తల్లీ'' తిరిగి మొదలు పెట్టాడు. ''పెళ్ళికి పైసా ఖర్చు పెట్టనీయలేదు. మా కుటుంబం కోసం, ఆ పిల్లలు జరిగిన ఘోర సంఘటనను మరచిపోయేలా చేయడం కోసం తన మకాం హైద్రాబాద్ మార్చాడు. నన్ను తనవద్దే వుండమని తీసుకుని వచ్చాశాడు. నే బాధపడకుండా హైద్రాబాద్ అయితే అందరికి అనుకూలంగా వుంటుంది అని చెప్పాడు. అంత మంచి బాబు అమ్మా! మా శంకరంబాబు! పైగా పిల్లలు పుట్టకుండ ఆపరేషన్ కూడా చేయించుకున్నాడట. తర్వాత తెలిసింది. ఈ పిల్లలను తనవాళ్లలాగే పెంచి యీరోజు ఈ స్కూలులో ఉత్తమ విద్యార్థులుగా బహుమతిని తీసుకునే స్థాయికి తీసుకొచ్చాడమ్మా! ఆ బహుమతులు అందుకోవడానికి తన భార్య,పిల్లలతో రావడమే కాదు, యితరులకు



బహుమతులు పంచి యీయడానికి తానే తగిన వ్యక్తిగా గుర్తింపుపొంది యీరోజు చీఫ్ గెస్ట్‌గా పిలవబడి వేదికనెక్కాడమ్మా.''

విషయం పూర్తిచేసి గర్వంగా మరోసారి తన అల్లుణ్ణి చూసుకుంటూ వున్న నరసింహం కళ్లు మెరవడం గమనిస్తున్న తనకు –

''సందీప్! శశిదీప్! బెస్ట్ స్టూడెంట్స్ ఆఫ్ దిస్ స్కూల్. వచ్చి బహుమతులు అందుకోవలసిందిగా కోరుచున్నాము'' అన్న పిలుపుతో యీ లోకానికి తిరిగిరాక తప్పలేదు. నరసింహం చేతుల నుంచి విడిపించుకుని యిద్దరి పిల్లలు పరిగెత్తుకుంటూ వేదికపై చేరి, స్వయంగా వారి దేవుడు చేతుల మీదుగా బహుమతులందుకున్నారు.

''వెల్‌డన్ శంకర్. వెల్‌డన్'' అంటూ నా మనస్సు గెంతులేసింది.

''హరి!'' తిరిగి ప్రకటన.

''వచ్చి బహుమతి స్వీకరించాలి'' పిలవడమే తడవు తనని లాక్కుంటూ స్టేజిపైకి తీసుకునిపోయాడు. అప్రయత్నంగానే వేదికపైకి వెళ్ళింది.

శంకరం సుబ్బలక్ష్మిల కళ్ళు ఒక్కసారే మెరిశాయి తన్ను చూసి –

''హల్లో! హల్లో!'' ముక్తసరిగా పలకరింపులయ్యాయి.

తెలియకుండానే తన మనస్సు శంకరం పాదాలను స్పృశించి, తిరిగి యధాస్థానానికి వచ్చి చేరింది, సుబ్బలక్ష్మిని దీవించడానికి, మెచ్చుకోవడానికి.

నల్లగా, మొద్దుగా, తుమ్మమొద్దులా, పొట్టిగా వుండే అలనాటి సుబ్బులమ్మ స్థానే, తెల్లగా, నాజూగ్గా, స్వచ్ఛంగా మెరిసే మనస్సుతో, తన కందనంత ఎత్తుగా వున్న సుబ్బలక్ష్మి కనిపించింది.

ఆమె శంకరంకు ఏ విషయంలోనూ తీసిపోదనిపించింది. అందరూ వీళ్లలాగే ఆలోచిస్తే లోకంలో అనాథలే వుండరు. ఏ సునామీలు ఏమీ చేయలేవు. వీళ్లిద్దరు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనిపించింది. శంకరానికి తెలియకుండానే రెండు చేతులతో నమస్కారం చేసింది. అది అతనికి వింతగా అనిపించి వుంటుంది. చేతులను తాకి మృదువుగా విడదీస్తూ పలికాడు –

''అందిన ద్రాక్షే తీయన'' అని. తన సందేహం అర్థమయింది అనుకుంటూ అతనికి.

''ఈ బంధం సునామీ బంధం'' అదే కొంటె చూపు, టక్కరి సమాధానం, గతాన్ని స్ఫురణకు తెచ్చాయి నాకు. సందేహాన్ని నివృత్తి చేశాయి. ఎదురుగా వున్న శంకర్ మఠం నుంచి స్పష్టంగా వినిపించింది స్మార్తం నేర్చుకుంటున్న వేదపాఠశాల విద్యార్థుల వేదఘోష.

''శ్రియోమే కామః సమృధ్యతాం''

★